# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 25-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 2026 సంవత్సరానికి గాను 66 మంది ప్రముఖులకు పద్మ పురస్కారాలను అందజేశారు.

- ❖ ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు ఉన్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా కొనసాగుతోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.

- ❖ విమానాశ్రయాలు, ఓడరేవులతో సహా అన్ని ప్రవేశ మార్గాల వద్ద ఎబోలా స్క్రీనింగ్ ఏర్పాట్లు చేయాలని కేంద్రమంత్రి జె.పి. నడ్డా అధికారులను ఆదేశించారు.

- ❖ దేశంలో పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా సజావుగా జరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 2026 సంవత్సరానికి గాను 66 మంది ప్రముఖులకు పద్మ పురస్కారాలను అందజేశారు. రాష్ట్రపతి భవన్‌లో ఈరోజు జరిగిన ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా తదితరులు పాల్గొన్నారు. ప్రఖ్యాత వయోలిన్ విద్వాంసుడు డాక్టర్ ఎన్. రాజంకు పద్మవిభూషణ్ పురస్కారం లభించింది. అలాగే ప్రముఖ సినీ నటుడు ధర్మేంద్ర సింగ్ డియోల్‌కు మరణానంతరం పద్మ విభూషణ్ లభించింది. ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి, మహారాష్ట్ర గవర్నర్ భగత్ సింగ్ కోష్యారి, శతావధాని డాక్టర్ ఆర్. గణేష్, పారిశ్రామికవేత్త ఉదయ్ సురేష్ కుమార్ కోటక్, డాక్టర్ కల్లిపట్టి రామస్వామి పాలైస్వామిలకు పద్మభూషణ్ లభించింది. పద్మశ్రీ పురస్కారం అందుకున్న ప్రముఖులలో భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ భుల్లర్, టాగా రామ్ భీల్ ఉన్నారు. 2026 సంవత్సరానికిగాను.. 5 పద్మ విభూషణ్, 13 పద్మభూషణ్, 113 పద్మశ్రీ అవార్డులతో సహా మొత్తం 131 పద్మ పురస్కారాల ప్రధానానికి రాష్ట్రపతి ఆమోదం తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు ఉన్నప్పటికీ దేశీయ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా కొనసాగుతోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SIDBI) 37వ వార్షికోత్సవం సందర్భంగా ముంబైలో కేంద్రమంత్రి ఈరోజు పలు కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దేశీయ వృద్ధిని పరిరక్షించేందుకే దేశ విధాన ప్రతిస్పందనను రూపొందించినట్టు పేర్కొన్నారు. భారతదేశ వృద్ధి పథం, ఉపాధి కల్పన, ఎగుమతి పోటీతత్వానికి ఎంఎస్ఎంఈ రంగం కేంద్రంగా ఉందన్నారు. పటిష్టమైన, సాంకేతికత ఆధారిత, సమ్మిళిత ఎంఎస్ఎంఈ పర్యావరణ వ్యవస్థను నిర్మించాలని ప్రభుత్వం నిబద్ధతతో ఉందని చెప్పారు. డీజిల్, పెట్రోల్ ఎక్సైజ్ సుంకాల్లో కోత వల్ల లక్ష కోట్ల రూపాయల రాబడిపై ప్రభావం పడుతుందని, అధిక బంగారం ధరలు విదేశీ మారకద్రవ్య రంగంలో కొన్ని సవాళ్లను సృష్టిస్తున్నాయని నిర్మలా సీతారామన్ వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విమానాశ్రయాలు, ఓడరేవులతో సహా అన్ని ప్రవేశమార్గాల వద్ద ఎబోలా స్క్రీనింగ్ ఏర్పాట్లు చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జె.పి. నడ్డా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎబోలా వైరస్ వ్యాధి నివారణకు సంబంధించిన సన్నద్ధత, నిఘా చర్యలపై న్యూఢిల్లీలో ఆయన ఈరోజు సమీక్ష నిర్వహించారు. అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రాకింగ్, టెస్టింగ్, నిఘా కోసం అవసరమైన వాటిని సిద్ధంగా ఉంచాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్‌ను కూడా మంత్రి ఆదేశించారు. అదే విధంగా.. దేశంలో ఇప్పటివరకు ఎబోలా కేసు ఏదీ నమోదు కాలేదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ.. ఎబోలా వ్యాప్తిని అంతర్జాతీయ ఆందోళన కలిగించే ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వచ్చే నెల 21వ తేదీన జరగనున్న నీట్ యూజీ - 2026 పునఃపరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కోరుతూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈరోజు లేఖ రాశారు. ప్రస్తుతం నెలకొన్న తీవ్రమైన వడగాలుల పరిస్థితుల దృష్ట్యా.. అభ్యర్థుల సౌకర్యం, శ్రేయస్సును పరిగణనలోకి తీసుకుని పరీక్షా కేంద్రాల్లో అన్ని అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లకు విజ్ఞప్తి చేశారు. సురక్షితమైన తాగునీరు, ఫ్యాన్లు, కూలర్లు, మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలని, రవాణా సౌకర్యాలు కల్పించాలని కోరారు. నీట్ (యూజీ) 2026 పునఃపరీక్ష సజావుగా జరిగేలా చూసేందుకు అన్ని రాష్ట్రాలు పూర్తిగా సహకరిస్తాయని కేంద్రమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ఎల్‌పిజి రిఫైనరీ ఉత్పత్తి రోజుకు 50 వేల టన్నులకు పెరిగిందని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ తెలిపారు. పశ్చిమాసియాలోని తాజా పరిణామాలపై న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన అంతర్-మంత్రిత్వ శాఖల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. దేశంలో పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా సజావుగా జరిగేలా చూసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నిస్తోందని తెలిపారు. గత 4 రోజుల్లో దేశంలో సుమారు కోటి 72 లక్షల గృహ వినియోగ ఎల్‌పిజి సిలిండర్ల పంపిణీ జరిగిందని చెప్పారు. ఓటిపి ఆధారిత డెలివరీలు 95 శాతానికి పైగా పెరిగాయన్నారు. ఈ నెల ప్రారంభం నుండి సుమారు లక్షా 56 వేల టన్నుల వాణిజ్య ఎల్‌పిజి అమ్మకాలు జరగగా.. గత 4 రోజుల్లోనే 24 వేల టన్నులకు పైగా వాణిజ్య ఎల్‌పిజి అమ్మకాలు జరిగాయని సుజాత శర్మ వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

హార్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి జరుగుతున్న చర్చలలో అమెరికా, ఇరాన్‌లు గణనీయమైన పురోగతి సాధించాయని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో అన్నారు. భారత్ పర్యటనలో ఉన్న ఆయన ఈరోజు విలేకరులతో మాట్లాడుతూ... ఒక ప్రాథమిక ఒప్పందం ఇరాన్ అణు కార్యక్రమం, ప్రాంతీయ భద్రతపై చర్చలకు మార్గం సుగమం చేయగలదని చెప్పారు. పశ్చిమాసియాలో సంఘర్షణను నిలిపివేయడానికి జరుగుతున్న ప్రయత్నాలకు ప్రపంచ వ్యాప్త మద్దతు ఉందని, అయితే శాంతి మార్గం అంత సులభం కాదని ఆయన పేర్కొన్నారు. లెబనాన్‌లో స్థిరత్వాన్ని కాపాడటానికి అమెరికా తన ప్రయత్నాలను కొనసాగిస్తోందని, ఈ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతలకు హిజ్బుల్లానే కారణమని మార్కో రూబియో ఆరోపించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నీట్ పరీక్ష నిర్వహణలో లోపాలు పునరావృతం కావడం పట్ల సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. వైద్య ప్రవేశ పరీక్ష నిర్వహణ కోసం ఎన్‌టీఏ స్థానంలో మరింత పటిష్టమైన, స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ఈరోజు విచారణ జరిపింది. జస్టిస్‌లు పీ.ఎస్. నరసింహ, అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం ఎన్‌టీఏ, సీబీఐల నుండి వివరణ కోరింది. గతంలో జరిగిన పేపర్ లీక్ వివాదం నుండి ఎన్‌టీఏ గుణపాఠం నేర్చుకోకపోవడం విచారకరమని వ్యాఖ్యానించింది. ఎన్‌టీఏ పని తీరును సమూలంగా మార్చేందుకు, మాజీ ఇస్రో చీఫ్ కె. రాధాకృష్ణన్ నేతృత్వంలోని కమిటీ గత ఏడాది చేసిన సిఫార్సులను అమలు చేసిన తీరును వివరిస్తూ.. ఈ నెల 28వ తేదీ లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని ఎన్‌టీఏను ఆదేశించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

చమురు, బంగారం వంటి దిగుమతి వస్తువుల వినియోగాన్ని తగ్గించడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ, విదేశీ మారక నిల్వలు బలపడతాయని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అన్నారు. హర్యానాలోని జింద్ జిల్లాలోని బిబిపూర్ గ్రామంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... ఇంధనాన్ని ఆదా చేసేందుకు తాను కూడా తన అధికారిక కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను తగ్గించినట్టు తెలిపారు. ఈ నెల 21వ తేదీన దేశంలో 271 గిగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైందని, దానిని దాదాపు పూర్తిగా తీర్చగలిగామని కేంద్రమంత్రి చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 134వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =